

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఆదివారం జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలియజేశారు. గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జోహార్ రెడ్డి విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం నాడు సమీక్ష నిర్వహించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీటితో పాటు ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు నిర్మాణాలు, రీసర్వే తదితర వాటిపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 పరీక్షలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

పుట్టపర్తి క్రైమ్ : జిల్లావ్యాప్తంగా గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్య అభ్యర్థులకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడుపుతోందని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి టి.మధుసూదన్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో జిల్లాకు సంబంధించిన డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్షలకు హాజరు తర్వాత తిరిగి అభ్యర్థులు తమ సొంత గ్రామాలకు వెళ్లడానికి ఏర్పాటు చేయాలని ఆర్టీసీ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

9 మందితో.. టిడిపి తొలి జాబితా

రాయదుర్గం



కాలవ శ్రీనివాసులు

ఉరవకొండ



పయ్యావుల కేశవ్

తాడిపత్రి



జెసి.అస్మిత్‌రెడ్డి

శింగనమల



బండారు శ్రావణిశ్రీ

కళ్యాణదుర్గం



అమిలినేని సురేంద్రబాబు

హిందూపురం



నందమూరి బాలకృష్ణ

రాప్తాడు



పరిటాల సునీత

పెనుకొండ



సవితమ్మ

మడకశిర



సునీల్‌కుమార్



- ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభ్యర్థుల ప్రకటన
- ముగ్గురు కొత్తవారు...ఆరుగురు పాతవారికే టికెట్లు
- పెనుకొండ, శింగనమల, కళ్యాణదుర్గంలో నిరసనలు

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు తెలుగుదేశం, జనసేనపార్టీలు ఉమ్మడి అభ్యర్థుల తొలిజాబితాను శనివారం ప్రకటించాయి. అధినేత చంద్రబాబు నాయుడు అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. మొదటి విడతగా 9 మంది పేర్లను ప్రకటించారు. పెనుకొండ, కళ్యాణదుర్గంలో కొత్త ముఖాలు తెరపైకి వచ్చాయి. మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న స్థానంలో ఆయన కుమారుడు బరిలోకి వచ్చారు. పెనుకొండ నుంచి సవితమ్మ, కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబు తొలిసారిగా అసెంబ్లీ బరిలో నిలవబోతున్నారు. రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి, హిందూపురం, రాప్తాడు నుంచి 2019లో పోటీ చేసిన వారే ఆయా నియోజకవర్గాల నుంచి 2024లో కూడా పోటీ చేయబోతున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ స్థానాల్లో టిడిపి అభ్యర్థులను ప్రకటించింది. ఖరారైన తొమ్మిది మందిలో ముగ్గురు కొత్తవారికి అవకాశం లభించగా ఆరుగురు పాతవారికే అవకాశం దక్కింది. కాగా టికెట్ల ప్రకటన అనంతరం నాలుగు నియోజకవర్గాల్లో నిరసనలు పెల్లుబికాయి. పెనుకొండ, కళ్యాణదుర్గం, మడకశిర, శింగనమల నియోజకవర్గాల్లో ఈ నిరసనలు వెలువడ్డాయి. ఇదిలా ఉండగా టిక్కెట్టు ఖరారైన నేతల ఇళ్ల వద్ద పెద్దఎత్తున సంబరాలు జరిగాయి.

ముగ్గురు కొత్తవారు...ఆరుగురు పాతవారు..

అనంతపురం జిల్లా పరిధిలో ఐదు స్థానాలు, సత్యసాయి జిల్లా పరిధిలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇందులో ముగ్గురు అభ్యర్థులు కొత్తవారుకాగా తక్కిన ఆరు స్థానాల్లో పాతవారికే అధిష్టానం అవకాశం కల్పించింది. అనంతపురం జిల్లాలో చూస్తే రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గానికి కాలవ శ్రీనివాసులుకు మరోమారు అవకాశం దక్కింది. ఉరవకొండకు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పయ్యావుల కేశవ్‌కు మళ్లీ అవకాశం లభించింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంకు అమిలినేని సురేంద్రబాబుకు కొత్తగా అవకాశం కల్పించింది. శింగనమల నియోజకవర్గానికి బండారు శ్రావణికి రెండోసారి అవకాశం దక్కింది. తాడిపత్రి నుంచి రెండవ సారి జెసి.అస్మిత్‌రెడ్డి అధిష్టానం బరిలో నిలిపింది. ఇక సత్యసాయి జిల్లాలో చూస్తే రాప్తాడుకు మాజీ మంత్రి పరిటాల సునీతను ప్రకటించారు. మడకశిరకు మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్‌కుమార్‌కు అవకాశం కల్పించారు. హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యే బాలకృష్ణ మరోసారి పోటీలో నిలిపారు. పెనుకొండకు బికె.పార్థసారధి కాకుండా ఈసారి సవితమ్మకు అవకాశం కల్పించింది.

నాలుగు చోట్ల నిరసనలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి అభ్యర్థుల ప్రకటన అనంతరం నాలుగు నియోజకవర్గాల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. 14 నియోజకవర్గాలకుగానూ తొమ్మిది నియోజకవర్గాలకు అభ్యర్థులను టిడిపి ప్రకటించింది. ఇందులో పెనుకొండ నియోజకవర్గంలో సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధికి కాకుండా సవితమ్మకు టిక్కెట్టు ఖరారు చేయడంపై బికె.పార్థసారధి మద్దతుదారులు నిరసనలు వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీలను తగులబెట్టి నిరసన చేపట్టారు. కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబుకు ప్రకటించడం పట్ల మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు మద్దతుదారులు స్థానికేతరులకు టిక్కెట్టు ఖరారు చేశారంటూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. శింగనమలకు నియోజకవర్గం టిక్కెట్టు బండారు శ్రావణికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నాయకులు ముంటి మడుగు కేశవరెడ్డి మద్దతు దారులు అనంతపురం జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యాలయంపైకి రాళ్లు రువ్వి, ఫర్నీచర్ ధ్వంసం చేశారు.

పెనుకొండలో తమ్ముళ్ల ఆగ్రహజ్వాల

- బికెకు మద్దతుగా నిరసన
- టిడిపి ఫ్లెక్సీలు, కరపత్రాల దహనం



పెనుకొండ టిడిపి కార్యాలయం వద్ద టిడిపి కరపత్రాలను దహనం చేస్తున్న బికె మద్దతుదారులు

పెనుకొండ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి టికెట్ల కేటాయింపు వ్యవహారం పెనుకొండ టిడిపిలో తీవ్ర అలజడిని రేపింది. సీనియర్ నాయకుడు, టిడిపి హిందూపురం జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారధికి టికెట్టు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఆయన మద్దతుదారులు తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. శనివారం నాడు చంద్రబాబు నాయుడు ప్రకటించిన జాబితాలో బికె పేరు లేకపోవడాన్ని తెలుసుకున్న ఆయన మద్దతుదారులు పెనుకొండలోని టిడిపి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన టిడిపి ఫ్లెక్సీలు, జెండాలను చించివేశారు. కరపత్రాలను రోడ్డుపై వేసి దహనం చేశారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ టిడిపి కష్టకాలంలో ఉన్న సమయంలో బికె.పార్థ సారథి పార్టీ కోసం కృషి చేశారని చెప్పారు. వివాదరహితుడిగా మంచి పేరు ఉన్న ఆయన్ను కాదని ఇతరులకు టికెట్టు ఇవ్వడం సరికాదన్నారు. అధిష్టానం పార్థసారథిని పిలిపించి టికెట్ విషయంలో చర్చించక పోవడం దారుణం అన్నారు. అధిష్టానం పునరాలోచించి ఎమ్మెల్యే అభ్యర్థిగా బికెకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పురం' రైల్వే స్టేషన్ ఆధునీకరణకు అడుగులు

రూ.15 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



హిందూపురం రైల్వే స్టేషన్

ప్రజాశక్తి-హిందూపురం

అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా దేశ వ్యాప్తంగా 550 రైల్వే స్టేషన్‌లను ఎంపిక చేసి అందులో అభివృద్ధి పనులను చేయనున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 72 రైల్వే స్టేషన్‌లను ఎంపిక చేశారు. వాటిలో హిందూపురం రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేశారు. రూ.15కోట్ల నిధులతో హిందూపురం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసేలా చర్యలను చేపట్టారు. ఈ నిధులతో ప్రయాణికులకు అనువుగా స్టేషన్‌ను ఆధునీకరణ చేయనున్నారు. ఈ పనులను సోమవారం నాడు ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్నారు. వీటితోపాటు రూ.23 కోట్లతో హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను వర్చువల్ విధానంతో ప్రారంభిస్తున్నారు. హిందూపురం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌లేటర్, లిఫ్టు, కోచ్ ఇండికేషన్ బోర్డులు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రధాని వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్న నేపథ్యంలో బెంగళూరు డిఆర్ఎంతో పాటు ఇతర రైల్వే అధికారులు ఆదివారం నాడు హిందూపురం రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలన చేయనున్నారు. పనుల ప్రారంభంలో భాగంగా సోమవారం ఉదయం రైల్వే స్టేషన్‌లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఇతర పనులను స్థానిక రైల్వే అధికారులు సోమప్ప, ఆనంద్‌తో పాటు స్టేషన్ మాస్టర్లు పర్యవేక్షిస్తున్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సూచించారు. శనివారం పుట్టపర్తి మండల పరిధిలోని పైపల్లి గ్రామంలో టీబీ ముక్తా పంచాయత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి ప్రవీణ్ కుమార్, డాక్టర్ మంజువాణి, డాక్టర్ సిల్వియా సాల్మన్, జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ తిప్పయ్య, కో ఆర్డినేటర్ నాగమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు పరీక్షలను చేశారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, గళ్లలో రక్తం పడుతున్నా, అనూహ్యంగా బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వేసుకుంటే ఈ జబ్బును నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్ సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎరికలప్ప, అబిద్‌బాషా, రాజేశ్వరి, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాదయాత్ర విజయవంతం



వైసిపి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో వైసిపి మళ్లీ అధికారం చేపట్టాలని, జగన్ మరోమారు సిం కావాలని కాంక్షిస్తూ శనివా రం మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చందమూరి నారాయణరెడ్డి నేతృత్వంలో చేపట్టిన పాదయాత్ర విజయవంతమైంది. పట్టణంలోని శివానగర్ శివాలయం వద్ద ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వైసిపి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. కౌన్సిలర్లు తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి కాటి కోటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూ ఉంటే ప్రతిపక్ష పార్టీలు బురదజల్లడం తగదన్నారు. నియోజకవర్గంలో వర్గాలు, కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా నవరత్నాలు పథకాలను అందించామన్నారు. కార్యక్ర మంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వేముల జయరామ్‌రెడ్డి, చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయి, కోటిరెడ్డి బాలిరెడ్డి, గజ్జల శివ, కడప రంగస్వామి, పురుషోత్తంరెడ్డి, తొండమాల రవి, ఉడుముల రాము, గీతా లోకేష్, చింతా భాస్కర్‌రెడ్డి, గుర్రం శీన, చాంద్‌బాషా, రవీందర్‌రెడ్డి, పరంధామరెడ్డి, బైముతకు రమణ, చెలిమి పెద్దన్న, కత్తె పెద్దన్న, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు, చిల్లవారి భాస్కర్‌రెడ్డి, జింక కంబగిరి, తోపుదుర్తి వెంకటరాముడు, తీర్థాల వెంకటరమణ, గుండా ఈశ్వరయ్య పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఉపాధి పొందండి : ఎమ్మెల్యే



బుక్కపట్నం చెరువులో చేపలు వదులుతున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

బుక్కపట్నం చెరువులో చేపల పెంపకం ద్వారా మత్స్యశాఖ సహకార సంఘం సభ్యులు, మత్స్య కారులు ఉపాధి పొందాలని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే శనివారం అక్కమ్మగారికొండ వద్ద చెరువులో 1.63 లక్షల చేప పిల్లలను వదిలారు. వీటి సంరక్షణ చేసుకొని అధిక లాభాలు పొందా లన్నారు. ఈ సంఘం సభ్యులు రాత్రి వేళల్లో ఉండడానికి కమ్యూనిటీ హాలు కూడా నిర్మిస్తామన్నారు. మత్స్యకారులకు పింఛను, మోటార్ బైకులు, పనిముట్లు అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసు కోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ రమణారెడ్డి, మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, సింగిల్‌విండ్ అధ్యక్షులు నాగభూషణ్, మత్స్యశాఖ అధ్యక్షులు మురళి, వైసిపి నాయ కులు సోమశేఖర్‌రెడ్డి, నాగరాజు, సత్తి, ఆకుకూర నరసింహులు, మోహన్, మధు పాల్గొన్నారు.

ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధి వాలంటీర్లు

పుట్టపర్తి అర్బన్ : ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ ప్రభుత్వానికి రథసారధులుగా వాలంటీర్లు ఉన్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు చెందిన 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత దగ్గరగా ప్రభుత్వ సేవలందించడం గర్వించదగ్గ విషయం అన్నారు. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయని 2 నెలల కాలం వాలంటీర్లు ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని కోరారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడితేనే తిరిగి వాలంటీర్ వ్యవస్థ నిలబడుతుందన్నారు. అనంతరం ఉత్తమ వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఎంపిడిఒ నాగేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ ఛైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, తిప్పన్న, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, సాయిగీత, ఆయా మండలాల ఎంపిపిలు, కన్వీనర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : సిఎం జగన్ వినూత్నంగా ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ దేశ చరిత్రలోనే గర్వించదగ్గ విషయమని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉత్తమ వాలంటీర్లకు గౌరవ పురస్కారాలు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో వీరి సేవలు మరవలేని వని, ఇలాంటి వ్యవస్థ ను రద్దు చేయాలనే టిడిపి, జనసేనపార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో ఎంపిపి పర్వీన్‌బాను, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాసులు, సర్పంచి గోవిందు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ రాజునాయుడు, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, నాయకులు షామీర్‌బాషా, లక్ష్మీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఫిక్, మజీద్, బాబా, జోలిబాబా, జగన్మోహన్‌చౌదరి, రామసుబ్బారెడ్డి పాల్గొ న్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

లయన్ ఖాసీంఖాన్



విలేకరులతో మాట్లాడుతున్న లయన్‌ఖాసీంఖాన్

ప్రజాశక్తి-కదిరి టౌన్

విభజనతో నష్టపోయిన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు లయన్ ఖాసీం ఖాన్ తెలిపారు. శనివారం నాడు కదిరి పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథి గహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో లౌకికవాదం, పేదల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. విభజన హామీలను అమలు చేయకుండా బిజెపి రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రధాని నరేంద్ర మోడీ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు అనంతపురంలో నిర్వహిస్తున్న సభలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మసీదు నిర్మాణానికి చాంద్‌బీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లయన్ ఖాసింఖాన్ రూ.75 వేల విరాళాన్ని మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాతా

ప్రజాశక్తి-గాడ్లపెంట

ఎయిడ్స్ నివారణలో భాగంగా శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో జన జాగృతి సంస్థ ఆధ్వర్యంలో వెంకటేష్ కళాజాతా బృందం ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మారుతి మహేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులు క్రమం తప్పకుండా మందు లు వాడితే జీవిత కాలం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కదిరి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, శైలజ, ఉషారాణి, వైద్య, కళాజాత సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపికి ప్రజల్లో ఆదరణ

కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

వైసీపీ ప్రభుత్వం పాలనతో విసిగిపోయిన ప్రజలు టిడిపిని ఆదరిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన కదిరి రూరల్ మండలం పట్నం గ్రామంలో పర్యటించారు. కందికుంట ఇంటింటికీ తిరుగుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. గతంలో పట్నం గ్రామంలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను ధర్మవరం నియోజకవర్గం ఎమ్మెల్యే తరలించుకుపోయారని, ప్రభుత్వం వచ్చిన వెంటనే తిరిగి పట్నం పోలీస్ స్టేషన్‌ను ఇదే గ్రామంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా కాలువ ద్వారా తలుపుల, గాండ్లపెంట, ఎన్పీ.కుంట మండలాలకు నీరు అందించే ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రజలను అన్ని విధాలా ఇబ్బందుల పాలుజేసిన వైసిపిని వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్నం గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

మోడల్ స్కూల్స్‌లో

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

మోడల్ స్కూల్స్‌లో ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు కషి చేయాలని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ మార్తాల వెంకట కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాడు పంగల్ రోడ్డులో ఉన్న ఆర్డీటీ స్కూల్ సమావేశం హాల్లో అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల నాలుగు జిల్లాల్లోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, మూడు సబ్జెక్టు టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. విద్యార్థులు వెనుకబడిన సబ్జెక్టులను గుర్తించి అందులో ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా అధ్యయన తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఏరోజుకారాజు పరీక్షలను నిర్వహించి మార్కులను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిని బి.వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, రాష్ట్ర కార్యాలయ సీబీఎస్ఇ కోఆర్డినేటర్ శ్రీలత, ఎఎంఒలు ధర్మకుమార్, శరత్, సత్యసాయి జిల్లా ఏడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన న్యాక్ కమిటీ పరిశీలన

అనంతపురం : జెఎన్‌టియులో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న న్యాక్ పీర్ కమిటీ పరిశీలన శనివారంతో ముగిసింది. యూనివర్సిటీలోని పలు విభాగాలను పరిశీలించి సమావేశాల్లో పాల్గొన్నారు. న్యాక్ పీర్ కమిటీ బందం మొదటి రోజు హైయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఉపకులపతి ఆచార్య జివిఎస్.శ్రీనివాస రావు, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ అధ్వర్యంలో కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. అనంతరం న్యాక్ కమిటీ బందం సభ్యులు మూడు గ్రూపులుగా విడిపోయి కళాశాలలోని అన్ని విభాగాలను పరిశిలించారు. రెండవ రోజు కాన్ఫరెన్స్ హాలులో సమావేశం అనంతరం యూనివర్సిటీలోని అన్ని కార్యాలయాల్లో డైరెక్టర్లతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆడిటోరియంను సందర్శించారు. మూడవ రోజు శనివారం నాడు డైరెక్టర్లు భోధన, భోధనేతర సిబ్బంది, విద్యార్థులతో న్యాక్ బందం మఖాముఖి సమావేశం నిర్వహించింది. మూడు రోజుల పర్యటన అనంతరం న్యాక్ బృందం జెఎన్‌టియు కళాశాలలోని అన్ని బాగున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం.విజయ కుమార్ , రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, ఐక్యూ సి డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు వి.సుమలత, ఇ.కేశవ రెడ్డి, కిరణ్మయి, సి.శోభా బిందు. పద్మ సువర్ణ, ఎ.సురేష్ బాబు, బి.ఈశ్వర్ రెడ్డి, యన్.విశాలి, పి.సుజాత, వి.చిత్ర, అనంతపురం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, కళాశాల విభాగాల అధిపతులు భువన విజయ, డాక్టర్ కెఎఫ్.భారతి, డాక్టర్ ఎం.రామ శేఖరరెడ్డి, డాక్టర్ కె.కళ్యాణి రాధ పాల్గొన్నారు.

వలస పక్షులతో యుద్ధానికి సంసిద్ధం

పెనుకొండ టిడిపి అభ్యర్థి ఎస్.సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

వలస పక్షులతో యుద్ధానికి సంసిద్ధం అని నియోజకవర్గ టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.సవిత స్పష్టం చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు శనివారం సవితను పెనుకొండ నియోజకవర్గ టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో సవిత మండలంలోని రాంపురం పంచాయతీ కొండంపల్లి, రాంపురం, మరువపల్లి గ్రామాల్లో దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమె తండ్రి మాజీ మంత్రి రామచంద్ర మాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఆమె తల్లి గాయత్రమ్మ ఆశీర్వాదం పొంది, ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఊరు వాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినందుకు చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. పెనుకొండలో వైసిపికి వలస పక్షులుగా అప్పుడు శంకరనారాయణ, ఇప్పుడు ఉషశ్రీ వచ్చారని, వీళ్లు ఎక్కడి నుంచో ఇక్కడికి వచ్చి ఏమీ అభివద్ధి చేయలేదన్నారు. అభివృద్ధి నిరోధకుడు, నియంత జగన్‌కు రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఎన్నికల రోజున ప్రజలు టీ గ్లాసులో టీ తాగి, సైకిల్ మీద వచ్చి టిడిపికి ఓటు వేసి, ఫీజులు పీకేసి ఫ్యాన్‌ను గుజరికి వేయాలన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రం అంతటా టిడిపి గెలుస్తుందని, పెనుకొండలో 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిచి చంద్రబాబుకి బహుమతిగా ఇస్తానని తెలిపారు. ఆమె వెంట టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పెనుకొండ టిడిపి అభ్యర్థి ఎస్.సవిత

వైభవంగా పేట వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో వెలసిన పేట వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బ్రహ్మ రథోత్సవం కనుల పండువగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు కర్నాటక, తమిళనాడుతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో కొలువుదీరిన పేట వెంకట రమణ స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పల్లకిలో తీసుకెళ్లి రథంలో కొలువుదీర్చారు. అనంతరం అశేషభక్తుల గోవింద నామస్మరణ మధ్య బ్రహ్మరథం కదిలింది. రథోత్సవాన్ని హిందూపురం వైసిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులకు పట్టణంలోని రాజకీయపార్టీలు, పలు సేవా సంఘాలు అన్న దా నం ఏర్పాటు చేశాయి. ఆలయ అధ్యక్షులు భగీరథ నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్ర మంలో దీపిక వేణురెడ్డి పంపిణీ చేశారు. డీఎస్పీ కంజాక్షన్ సూచనల మేరకు పట్టణ సిలు, పోలీసు అధికారులు అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న వైసిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక, వైసిపి నాయకులు

మడకశిర టిడిపి అభ్యర్థిగా సునీల్‌కుమార్

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ టిడిపి, జనసేనపార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు సునీల్‌కుమార్‌ను శనివారం ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఆయన పట్టణంలోని ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ర్యాలీగా వాల్మీకి సర్కిల్ చేరకుని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమి 160కి పైగా స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు చేయ డం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట కుంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం పాండు రంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, నాయకులు అశ్వత్థామప్ప, ఎస్ఎం క్రిష్టప్ప, మంజునాథ్, రమేష్, నరేష్, జయసింహా, రామన్న, నారాయణప్ప, ఈరన్న, నరేష్, మంజునాథ్, కార్యకర్తలు ఉన్నారు.



నారా లోకేష్‌తో మడకశిర సునీల్‌కుమార్

టిడిపికి పలువురి రాజీనామా

రొద్దం : పెనుకొండ నియోజకవర్గ టిడిపి టికెట్ పార్టీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధికి దక్కక పోవడంతో శనివారం మండలంలో పలువురు నాయకులు పదవులు, పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. అందులో మండలంలోని తురకలాపట్నం గ్రామానికి చెందిన నాగేంద్ర పార్టీ సభ్యత్వం, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పదవికి రాజీనా మా చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి పార్టీ కోసం పని చేసిన బికె.పార్థసారధికి టికెట్ కేటాయించకపోవడం తగదన్నారు. ఈ విషయంపై పార్టీ అధినేత చంద్రబాబు పునరాలోచణ చేయాలని కోరారు.



నాగేంద్ర

టిడిపితోనే ముస్లిముల అభివృద్ధి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

టిడిపితోనే ముస్లిముల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ హిందూపురం పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్ పేర్కొన్నారు. పట్టణం లోని 27వ వార్డులో టిడిపి ముస్లిం నాయకుల ఆధ్వ ర్యంలో శనివారం ముస్లింలు పవిత్రంగా భావించే యాసిన్‌సూర ఫొటొలను ముస్లింల ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అందేవని, జగన్ అధికారంలోకి వచ్చాక ఆయా పథకాలను రద్దు చేశారన్నారు. టిడిపి అధికా రంలోకి వస్తే ఆయా పథకాలను పునరుద్ధరి స్తారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు అత్తార్ రహీంబాషా, నాయకులు రాళ్లపల్లి షరీఫ్, సలీంబాషా, ఉస్మాన్ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

రాష్ట్రంలో అన్ని వర్గాలు బాగుపడాలంటే టిడిపి అధికారంలోకి రావాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ బీరే గోపాలక్రిష్ణ, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా శనివారం 25వ వార్డులో పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. వైసిపి అరాచక పాలనకు ఓటు అనే ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో 25వ వార్డు ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు, నాయకులు గడ్డం సూరి, చీమల రామాంజి, క్లస్టర్ రామాంజనేయులు, గంగాధర్, శ్రీనివాసులు, రవి, పోతలయ్య, అమర్నాథ్, క్రిష్ణ, చిరంజీవి, జనార్దన్, సూరి, శీలామూర్తి, గడ్డం కుళ్లా యప్ప, మాధవరెడ్డి, బడిగింజల రమణ, కరెంటు ఆది, గోసల శ్రీరాములు, మారుతిస్వామి, సంజీవులు, స్వర్ణకుమారి, మున్ని, శారద, మీనాక్షి, అఖిల పాల్గొన్నారు.



ముస్లిములకు యాసిన్ సూర ఫొటో ప్రేమ్ అందజేస్తున్న టిడిపి నాయకులు



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి

ఎమ్మెల్యే కేతిరెడ్డి సోదరుల చేయూత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఆయన తమ్ముడు కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి మరోమారు దాతృత్వం చాటుకున్నారు. మండలంలోని మల్లాకాలువ గ్రామంలో వెలసిన సీతారాముల ఆలయ అభివృద్ధి పనులకు రూ. 3 లక్షల విరాళం అందజేశారు. నేలకోట గ్రామంలో ఇటీవల విద్యు దాఘాతంతో మృతి చెందిన వడిత్యా శీనానాయక్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20 వేలు అందజేశారు. పట్టణంలోని 28వ వార్డులో మసీదు ఆవరణలో గదుల నిర్మాణం కోసం రూ. 20 వేలు విరాళాన్ని కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అందజేశారు.

గీతాంజలిచౌదరికి డాక్టరేట్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని వలిమిచెర్లోపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ, ఉమాదేవి దంపతుల కుమార్తె లింగుట్ల గీతాంజలిచౌదరికి గౌరవ డాక్టరేట్ వచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఆమె ఈ నెల 22వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్ పటేల్ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి విశ్వవిద్యాలయంలో 2020-23లో కీటక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ హేమ్‌సింగ్ నేతృత్వంలో పి.హెచ్.డి. పూర్తి చేశారని, ఆ రాష్ట్రంలో ప్రధాన పంట అయిన ఆవాలు పంటలో వచ్చే పేను బంక పురుగుపై జరిపిన పరిశోధనలకు గౌరవ డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. గీతాంజలిని పలువురు అభినందించారు.



రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్ పటేల్ నుంచి డాక్టరేట్ పట్టా అందుకుంటున్న గీతాంజలి

కనుల పండువగా చెన్నకేశవస్వామి తడక మహోత్సవం

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని చంద్రాయునిపల్లి గ్రామ సమీప కొండల్లో వెలసిన చెన్నకేశవస్వామి తడక మహోత్సవాన్ని శనివారం తంగం వంశస్థుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఏటా మాఘ మాసంలో పౌర్ణమి సందర్భంగా తడక మహోత్సం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కళాకారుల డప్పు వాయిద్యాల మధ్య నూతన తడక మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. చివరగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మహోత్సవ కార్యక్రమంలో ఆలయ పూజారులు, తంగం వంశస్థులు, వైసిపి, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తడక మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

వైభవంగా పౌర్ణమి గరుడ సేవ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సమాజ హితం కోసమే ప్రతి నెలా పౌర్ణమి గరుడ సేవలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఇఒ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆల యంలో శనివారం సాయంత్రం అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్, చక్రధర్ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి గరుడ సేవలో భాగంగా స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులను గరుడ వాహనంలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. గరుడ సేవ ఉభయదాతలైన పురోహితులు పంచాంగం సరసా దత్తు మూర్తి, సౌందర్యలహరి, కుమారుడు కాశీ విశ్వనాథ్ కుటుంబ సభ్యులను ఛైర్మన్, ఇఒ సత్కరించారు. అన్నమయ్య సేవా మండలి ద్వారా పొరాళ్ల పుల్లయ్య శిష్య బృందం చేసిన అన్నమయ్య సంకీర్తనలు, భజనలు, గోదా రంగనాథ మహిళా మండలి వారు నిర్వహించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కుండా చౌడయ్య, ఆలయ పాలక మండలి సభ్యులతో పాటు పొరాళ్ల పుల్లయ్య, పొరాళ్ల పద్మావతి, వారి శిష్య బృందం, ఆలయ సిబ్బంది మల్లికార్జున, మేనేజర్ రామశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

గోరంట్లలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు

గోరంట్ల : పెనుగొండ నియోజకవర్గ టిడిపి టికెట్ సవితమ్మకు కేటాయించడంతో పట్టణంలో సవితమ్మ అభిమానులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. సవితమ్మ గెలుపు కోసం గ్రామ గ్రామాన ఇంటింటికీ తిరిగి సైనికుల్లా పని చేస్తామని తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, బాలకృష్ణచౌదరి, శ్రీధర్ పాల్గొన్నారు



గోరంట్లలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సవితమ్మ అభిమానులు

విద్యుత్ పరికరాల కొనుగోలుకు మక్బుల్‌బాషా సాయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

తలుపుల మండలంలోని పూతలవాండ్లపల్లి పంచాయతీ నాయన వారిపల్లి గ్రామంలో కొన్ని నెలలుగా విద్యుత్ అంతరాయం ఏర్పడి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమై గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచి పెద్దినాయుడు సమస్యను నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బిఎస్.మక్బుల్‌బాషా దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా విద్యుత్ సరఫరాకు అవసరమయ్యే పరికరాల కోసం రూ. లక్ష అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎండి ఇస్మాయిల్, కె.ఎర్రంనాయుడు, కె.చలపతినాయుడు, పి.ప్రభాకర్, కె.కొండమనాయుడు, కె.భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.



నాయన వారిపల్లి గ్రామస్తులకు రూ. లక్ష అందజేస్తున్న మక్బుల్‌బాషా

సచివాలయ ఉద్యోగుల బదిలీలను వాయిదా వేయాలి

పుట్టపర్తి రూరల్ : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రేషనలైజేషన్ పద్ధతి ద్వారా బదిలీలు చేయడం సరైన పద్ధతి కాదని ఎపి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి బదిలీలు చేపడితే పూర్తి సమయం వెచ్చించి పనిలో నిమగ్నం అవుతారన్నారు. ఎపిజిఎడబ్ల్యుఎస్ ఉద్యోగుల పిల్లల పరీక్షలను దృష్టిలో ఉంచుకొని బదిలీలను వాయి దా వేయాలని కోరారు. రికార్డు అసిస్టెంట్ స్థాయి నుంచి సీనియర్ అసిస్టెంట్ వరకూ స్కేల్ మార్పు, ఉద్యోగోన్నతులు, జాయినింగ్ డేట్ నుంచి రెగ్యులర్ చేస్తూ అరియర్స్, ఈఎల్, హెచ్‌పిఎల్, ఎఫ్ఎసి అలవెన్సులు, యూనిఫారం తొలగింపు, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

3న పల్స్‌పోలియో : డిప్యూటీ డిఎంహెచ్ఒ

ధర్మవరం టౌన్ : మార్చి 3వ తేదీ నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సల్మాన్, పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్‌నాయక్, డాక్టర్ స్రవంతి, యుపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు శ్వేత, ప్రియాంక, చంద్రకళ సూచించారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సెల్వియా మాట్లాడుతూ పల్స్‌పోలియోలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 0-5 ఏళ్ల లోపు పిల్లలందరికీ తప్పక పల్స్‌పోలియో చుక్కలు వేయాలన్నారు. పట్టణంలో మొత్తం 67 కేంద్రాలు ఏర్పాటు చేశామని, సమీప కేంద్రాల్లో పిల్లలకు టీకాలు వేయించాలన్నారు. మిస్సయిన వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పల్స్‌పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సూపర్వైజర్లు, సిఒలు, ఎంఒ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయంలో పౌర్ణమి పూజలు

ధర్మవరం టౌన్ : పౌర్ణమి సందర్భంగా శనివారం పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సాయినగర్‌లో వెలసిన షిరిడి సాయిబాబా దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. మూలవిరాట్ ను వివిధ ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. షిరిడి సాయిబాబా సేవా సమితి అధ్యక్షులు సూరి ప్రకాష్, డైరెక్టర్ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు వీరనారాయణ, రామలింగయ్య, టిసి.నాయుడు, జె.సూర్యనారాయణ, హేమంత్ కుమార్, ఆలయ వాలంటీర్లు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

పుట్టపర్తి రూరల్ : వికలాంగురాలి దీనగాథ సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పలువురు మానవతా వాదులు శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న లక్ష్మినారాయణమ్మకు నిత్యావసర సరుకులు అందజేశారు. కిద్మత్ ఎ ఖల్క ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు షామీర్ ఆధ్వర్యంలో అతని మిత్రుడు సత్యసాయి భక్తుడు రవికుమార్ జన్మదినం సందర్భంగా లక్ష్మినారా యణమ్మకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

26న 'అనంత'లో కాంగ్రెస్ సభ

సోమందేపల్లి : ఈ నెల 26వ తేదీ అనంతపురం నగరంలోని న్యూ టౌన్ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పునర్నిర్మాణ పోరాట సభను విజయ వంతం చేయాలని మండల అధ్యక్షుడు గంగాధర్ కోరారు. సోమందేపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ ఆ సభకు ముఖ్య అతిథులుగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పాల్గొంటార న్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పెద్దఎత్తున హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

గ్రూప్-2 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగే గ్రూప్-2 పరీక్షకు 300 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల సూపరింటెండెంట్ ఆదిశేషారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఐడి ప్రూఫ్(ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు ఐడి, పాన్ కార్డ్) వెంట తీసుకు రావాలన్నారు.

'చలో గుత్తి'కి తరలిరండి

ధర్మవరం టౌన్ : ఎస్సీ వర్గీకరణను సాధించుకోవడానికి అందరూ సంసిద్ధులు కావాలంటూ ఈ నెల 28వ తేదీ గుత్తి పట్టణంలోని సితార కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సిరిడి బూదెప్ప, సహాయ కార్య దర్శి గజ్జల రామాంజనేయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని జగ్జీవన్ రామ్‌నగర్‌లో శనివారం 'చలో గుత్తి' కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సమావేశానికి ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతార న్నారు. కార్యక్రమంలో పట్టణ గౌరవాధ్యక్షుడు గజ్జల శివప్రసాద్, నాయకులు పవన్‌కుమార్, నాగేపల్లి కామరాజు, నరసింహులు, నితీష్‌కుమార్, పూజారి పెద్దన్న, చంద్రశేఖర్, కీర్తన, రామ్మూర్తి పాల్గొన్నారు.

రైతు అనుమానాస్పద మృతి

అమరాపురం : మండలంలోని వలస పంచాయతీ పొలిమేరలో కర్నాటక సరిహద్దులో రైతు నాగరాజప్ప మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులు హత్య అని పరుశురాంపుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమరాపురం ఎఎస్ఐ రామాంజనేయులు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

తలుపుల : మండలంలోని కుటాగుళ్ల మలుపు వద్ద ఓ వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. అదే సమయంలో కదిరి నుంచి తలుపుల వెళ్తున్న ఎస్ఐ దిలీప్‌కుమార్ జీపు ఆపి గాయపడిన వృద్ధుడిని తన వాహనంలోనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టిడిపిలో పలువురు చేరిక

కదిరి టౌన్ : రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాకు చెందిన 70 కుటుంబాలు శనివారం వైసిపిని వీడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి కందికుంట టిడిపి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

యాసిన్ సూర ఫొటోలు పంపిణీ

ముదిగుబ్బ : స్థానిక పాతూరు, గేట్ కొట్టాలలో శనివారం టిడిపి మైనార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ముస్లిం కుటుంబాలకు యాసిన్ సూర ఫొటోలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల మనోహర్, అమీర్‌బాషా, షబ్బీర్, బషీర్, దాదావలి, అబ్బు, అజ్మీర్, రామంజి, ప్రతాప్, పుల్లప్ప, చిన్న వెంకటేష్, నంద పాల్గొన్నారు.

ఎన్నికల నిఘా వేదిక జిల్లా సమన్వయకర్తగా భాస్కర్‌నాయుడు

పుట్టపర్తి రూరల్ : ఉమ్మడి అనంతపురం జిల్లాల సమన్వయకర్త లయన్ షేక్ నబి రసూల్ ఆధ్వ ర్యంలో శనివారం ఎన్నికల నిఘా వేదిక ఉభయ జిల్లాల సభ్యుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఇందులో డాక్టర్ భాస్కర్‌నాయుడును శ్రీసత్యసాయి జిల్లా సమన్వయకర్తగా ఎంపిక చేశారు. ఈయన ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో 'పర్యావరణ పరిరక్షణ' అంశంపై సేవలందించారు. ప్రజల కోసం అసెంబ్లీలో గళం విప్పగలిగే నాయకులను ఎన్నుకునేలా ఓటర్లను చైతన్యవంతం చేయడం, ఎన్నికల ప్రక్రియ సజా వుగా పూర్తయ్యేలా సభ్యులందరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

లేపాక్షి : 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో భాగంగా శనివారం హిందూపురం నియోజకవర్గ వైసిపి నాయకులు వేణురెడ్డి స్థానిక బసవన్నవీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. 99 శాతం హామీలను నెరవేర్చిన సిఎం జగన్‌ను మరోమారు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పి టిసి శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి, వైస్ ఎంపిపిలు అంజన్‌రెడ్డి, లీలావతి, సర్పంచి ఆదినారాయణ, కో ఆప్షన్ సభ్యులు బషీర్, నాయకులు ద్వారకనాథరెడ్డి, చలపతి, ఇర్ఫాన్, మాధవరెడ్డి, నిస్సార్, బోర్ల అంజన్‌రెడ్డి శ్రీనివాసులు, మోహన్, నరసప్ప, తిప్పన్న పాల్గొన్నారు.



'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న వేణురెడ్డి

రాజకీయ కాక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు సమయం ఆసన్నం అవుతుండటంతో రాజకీయ వాతవరణం వేడెక్కుతోంది. ఎన్నికల ఏర్పాట్లకు సిద్ధమవుతూనే అభ్యర్థులను రాజకీయపార్టీలు ఖరారు చేస్తూ పోతున్నాయి. ఇది కూడా రాజకీయ వాతావరణం వెడెక్కుతోంది. ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల ఖరారు పూర్తవుతున్నాయి. దీంతో ఒక్కో అసెంబ్లీ స్థానంపై స్పష్టత ఏర్పడుతోంది. ఇప్పటికే వైసిపి ఏడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. టిడిపి తాజాగా 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఈ ప్రకటనలతో ప్రధాన పార్టీల అభ్యర్థులెవరన్న దానిపై స్పష్టత వస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, శింగనమల, మడకశిర నియోజకవర్గాల్లో రెండు పార్టీల నుంచి అభ్యర్థులు ఖరారైన వాటిల్లో ఉన్నాయి. తక్కిన వాటటిల్లోనూ త్వరలోనే వైసిపి అభ్యర్థులను ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. అధికారిక ప్రకటన రానిచోట్ల తమ పేర్లను ఖరారు చేయించుకోవడానికి ఆశావహులు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రకటనలతో మొత్తంగా ఈ వారంలో ఎన్నికల వాతావరణం మరింత ఊపందుకుంటోంది. ఇప్పటికే ప్రధాన పార్టీల నేతల ప్రచార కార్యక్రమాలు పాల్గొంటున్నారు. గత వారంలో వైసిపి రాయాలసీమ స్థాయి సభను పెద్దఎత్తున నిర్వహించింది. భారీ జనసమీకరణ చేపట్టి విజయవంతమైందని ఆ పార్టీ నేతలు సంబరపడుతున్నారు. టిడిపి కూడా వచ్చే వారంలో సభలను నిర్వహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వచ్చే వారంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని అనంతపురం నుంచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. దీనికి వామపక్ష పార్టీలు హాజరుకానున్నాయి. కేంద్రంలోని మతత్వ బిజెపికి వ్యతిరేకంగా ఈ సభను నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అదే విధంగా రాష్ట్ర విభజన హామీలను అమలు చేయించే విషయంలో ఇక్కడి పార్టీలైన టిడిపి, వైసిపిలు విఫలం చెందాయని విమర్శిస్తున్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభను నిర్వహిం చనున్నట్టు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మరోవైపు అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో బిజీబిజీ అయింది. పోలింగ్ కేంద్రాల పరిశీలన కొనసాగుతోంది. అదేవిధంగా స్ట్రాంగ్ రూమ్‌లతోపాటు, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు ఏ విదంగా ఉండాలన్న పరిశీలనను రెండు జిల్లాలోనూ కలెక్టర్లు పరిశీలిస్తున్నారు. అదే విధంగా ఎంత మంది ఉద్యోగులు అవసరమవుతారన్న అంచనాలను రూపొందిస్తున్నారు. మొత్తంగా రాజకీయ పార్టీలు మరోవైపు అధికారిక ఏర్పాట్లు రెండు సమాంతరంగా కొనసాగుతున్నాయి. ఇక ఈవారంలో జర్నలిస్టు దాడికి సంబంధించిన అంశం ప్రధాన చర్చనీయాంశమైంది. ఫొటో జర్నలిస్టుపై వైసిపి బహిరంగ సభలో జరిగిన దాడిపై జర్నలిస్టులు, రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు నిరసనలు చేపట్టాయి. జర్నలిస్టులపై జరుగుతున్న దాడిని ఖండిస్తూ నిరసనలు కొనసాగాయి. రాజకీయాల్లాగానే వాతావరణమూ వెడెక్కుతోంది. వేసవి తాపం పెరుగుతోంది. దీంత గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికే అనేక గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే పరిస్థితులు వస్తున్నాయి. విద్యుత్ సమస్యలతో పంటలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం నేతలు, రాజకీయాల్లో బిజీ అయిన నేపథ్యంలో రైతుల సమస్యలు, తాగునీటి సమస్యలపై పెద్దగా చర్చ రాకుండా ఉండిపోతున్నాయి.

